క్లుప్తంగా

నేత్రాలను సంరక్షించుకోవాలి



కంటి వైద్య శిబిరంలో వృద్ధురాలిని పరీక్షిస్తున్న సిబ్బంది

కె.గంగవరం: కోట గ్రామంలో బుధవారం ప్రజా సేన అధ్యక్షుడు కాటే సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఉచిత నేత్ర వైద్య శిబిరం జరిగింది. కపిలేశ్వరపురానికి చెందిన ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రి సిబ్బంది గ్రామంలోని 50 మందికి ఉచితంగా కంటి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. 12 మందికి శస్త్రచికిత్సలు అవసరమని గుర్తించి ఉచితంగా ఆపరేషన్లు చేసేందుకు ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా నిర్వాహకుడు సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ నేత్రాలను ప్రతి ఒక్కరూ సంరక్షించుకోవాలన్నారు. రజనీ, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

ఫెర్రీ జాయింట్ కమిటీ ఏర్పాటు



ఫెర్రీ జాయింట్ కమిటీ సమావేశంలో సభ్యులు

కె.గంగవరం: కోటిపల్లి ఫెర్రీ జాయింట్ కమిటీ బుధవారం ఏర్పాటైంది. ఈ మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో సమావేశం నిర్వహించారు. జాయింట్ కమిటీ అధ్యక్షులుగా ఎంపీపీ పంపన నాగమణి, సభ్యులుగా జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, డివిజనల్ కార్యనిర్వహణాధికారిగా ఎం.రామకృష్ణారెడ్డి నియమితులయ్యారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో జాయింట్ కమిటీలు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ త్వరలోనే సమావేశం నిర్వహించి ఫెర్రీ వేలం పాటకు సంబంధించి నిబంధనల ప్రకారం విధివిధానాలు ఖరారు చేస్తామన్నారు.

బాధిత చిన్నారికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న దాతలు

మండపేట: కడుపులో కణితితో బాధపడుతున్న కేశవరానికి చెందిన చిన్నారి ప్రశాంతికి పలువురు బుధవారం ఆర్థిక సాయమందించారు. కరుణామయ యూత్ ఫ్రెండ్స్ సర్కిల్ సభ్యులు రూ.3 వేలు, నిత్యావసర సరకులను అందజేశారు. ధనలక్ష్మి పౌల్ట్రీ ఫామ్ జట్టు కూలీలైన పలివెల సత్తిబాబు స్నేహితులు 25 కిలోల బియ్యం ఇచ్చారు. పాస్టర్ స్వర్ణన్‌రాజు, పోసుపో అశోక్‌బాబు, వినీత్, వై.శ్రీనివాస్, చంద్రమళ్ల సుధీర్, చంద్రహాస్ పాల్గొన్నారు.

57 మందికి కళ్లజోళ్ల పంపిణీ



కళ్లజోళ్లు అందజేస్తున్న ఏఎంసీ చైర్మన్ సిరిపురపు, సొసైటీ చైర్మన్ రంగారావు

మండపేట: ద్వారపూడి సొసైటీ పరిధిలో ఇటీవల నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి సంబంధించి అవసరమైన 57 మందికి బుధవారం కళ్లజోళ్లను పంపిణీ చేశారు. సొసైటీ చైర్మన్ తులా శ్రీరంగారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, ద్వారపూడి ఆంధ్రా శబరిమలై వ్యవస్థాపకుడు ఎస్ఎల్ కనకరాజు గురుస్వామి ముఖ్య అతిథులుగా హాజరై లబ్ధిదారులకు కళ్లజోళ్లు అందజేశారు. సిరిపురపు మాట్లాడుతూ సొసైటీ ద్వారా రైతుల సంక్షేమంతో పాటు గ్రామస్తులకు కంటి వైద్య శిబిరాల నిర్వహణ అభినందనీయమన్నారు. సొసైటీ సీఈఓ తోట వెంకటరామయ్య, గ్రామ ప్రముఖులు మండ వీరభద్రరావు, నందూరి వెంకటనాగేశ్వరరావు, వాడ్రేవు సూర్యవెంకట కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఉన్నతంగా రాణించాలి



విద్యార్థులకు రైఫిల్ అందజేస్తున్న వెంకటరమణ

కాజులూరు: పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వంతో పాటు దాతలు అందిస్తున్న సహకారాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, భవిష్యత్తులో ఉన్నతంగా రాణించాలని గొల్లపాలెం జెడ్పీ పాఠశాల హెచ్‌ఎం ఎం.వెంకటరాణి అన్నారు. పాఠశాల ఎన్‌సీసీ విద్యార్థుల రైఫిల్ షూటింగ్ కోసం బుధవారం గ్రామానికి చెందిన దీవెన మెడికల్స్ అధినేత వి.వెంకటరమణ రూ.20 వేల విలువజేసే రైఫిల్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు దాత వెంకటరమణను అభినందించారు. స్కూల్ స్టాఫ్ సెక్రటరీ పి.సత్యనారాయణ, పీడీ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సర్వేజనా సుఖినోభవంతు

- ముమ్మరంగా 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే
- ఇంటింటా వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది
- ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు



జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

రాయవరం: ఆరోగ్యమే మహాభాగ్యం.. ఈ నానుడిని ప్రభుత్వం నిజం చేస్తోంది.. అందరి ఆరోగ్య భద్రతకు భరోసాగా నిలుస్తోంది.. వైద్య రంగంలో విప్లవాత్మక సంస్కరణలు తీసుకువస్తుంది.. పేదలకు నాణ్యమైన, మెరుగైన వైద్య సేవలను అందిస్తోంది. వైద్య రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇప్పటికే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీని మరింత బలోపేతం చేశారు. పైసా ఖర్చు లేకుండా కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు ప్రజలు పొందే విధంగా ఆరోగ్యశ్రీని తీర్చిదిద్దడమే కాకుండా, మరో అడుగు ముందుకు వేసి పేదల ఇళ్ల ముంగిటకే వైద్య సేవలు అందించేందుకు ఫ్యామిలీ డాక్టర్ విధానానికి శ్రీకారం చుట్టిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కుతుంది. ఇదిలా ఉంటే ప్రస్తుతం ప్రతి గ్రామంలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమం మహాయజ్ఞంలా నిర్వహిస్తున్నారు.

ముమ్మరంగా సర్వే

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వే ముమ్మరంగా సాగుతోంది. ఇప్పటికే 10 రోజుల నుంచి వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఇంటింటికీ తిరిగి ప్రాథమిక రక్త పరీక్షలు నిర్వహిస్తున్నారు. ప్రతి సచివాలయం పరిధిలోనూ ప్రతి ఒక్కరికీ పరీక్షలు చేస్తున్నారు. ఈ సర్వేలో క్లస్టర్ పరిధిలో 2,658 మంది వలంటీర్లతో పాటు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొంటున్నారు. ఈ నెల 30 నుంచి జరిగే వైద్య శిబిరాల్లో ఇరువురు స్పెషలిస్టులు, ఇరువురు పీహెచ్‌సీ వైద్యాధికారులు, ల్యాబ్ టెక్నీషియన్లు, వైద్య సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందిస్తున్నారు.

క్లస్టర్‌లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ఇలా..

మండలం	సచివాలయాలు	కుటుంబాలు	సర్వే పూర్తి
కె.గంగవరం	23	23,866	6,004
రామచంద్రపురం రూరల్	21	26,736	7,928
మండపేట రూరల్	23	29,125	9,571
కపిలేశ్వరపురం	20	23,443	9,246
రాయవరం	19	24,122	10,530
మండపేట అర్బన్	14	20,376	14,779
రామచంద్రపురం అర్బన్	12	14,344	11,355

ఆరోగ్య వివరాల సేకరణ

జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా ఏఎన్ఎంలు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల ఆరోగ్య వివరాలను సేకరిస్తున్నారు. ఎత్తు, బరువు నమోదు చేయడంతో పాటు ఆర్బీఎస్, మలేరియా, డెంగీ, టీబీ, హిమోగ్లోబిన్ వంటి ప్రాథమిక పరీక్షలను చేస్తున్నారు. ఇందులో భాగంగా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ప్రతి రోగికీ ఒక కేస్ షీట్ తయారు చేస్తారు. అందులో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల వివరాలు, రోగి రక్త నమూనాలు, రోగాల వివరాలు, వారికి అందించిన మందులు, తినాల్సిన, తినకూడని ఆహారం, కాల్షియం, ఐరన్ మాత్రలు.. ఇలా ప్రతి వివరాన్ని నమోదు జరుగుతోంది. 53 రకాల పరీక్షలు ఉచితంగా చేస్తున్నారు. అవసరమైన వారికి ఉచితంగా 150 రకాల మందులను సైతం అందజేయనున్నారు. దీర్ఘకాలిక వ్యాధుల బారిన పడిన వారికి నెలకు సరిపడా మందులు అందజేస్తున్నారు. మెరుగైన వైద్యం అవసరమైన వారికి ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రుల ద్వారా వైద్యం అందించనున్నారు.

ఈ నెల 30 నుంచి వైద్య శిబిరాలు

మండపేట, రామచంద్రపురం నియోజకవర్గాల పరిధిలో ఈ నెల 30 నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు పటిష్టంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో ప్రాథమిక వైద్య పరీక్షలు నిర్వహిస్తున్నారు. మరి కొన్ని గ్రామాల్లో ప్రజారోగ్య వివరాలపై సర్వే చేస్తున్నారు. ఈ నెల 30 నుంచి ప్రజారోగ్య వివరాల ఆధారంగా వైద్య శిబిరాలను నిర్వహించనున్నారు.

పాఠశాలల ప్రగతిలో ప్రజా భాగస్వామ్యం



డీవైఈఓను సత్కరిస్తున్న ప్రగతి రామారెడ్డి, సుబ్బారెడ్డి, సాయిరామ్మోహన్‌రెడ్డి

రాయవరం: పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం చేస్తున్న కృషిలో ప్రజల భాగస్వామ్యం కూడా కీలకమని రామచంద్రపురం డీవైఈఓ నరసింహఫణి తెలిపారు. పసలపూడి మండల పరిషత్ మెయిన్ ప్రాథమిక పాఠశాలను బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల అభివృద్ధికి అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి చేస్తున్న కృషిని ఆయన పరిశీలించారు. పాఠశాలలో విద్యార్థుల సంఖ్యను పెంచడంతో పాటు, దేశ నాయకుల విగ్రహాలను ఏర్పాటు చేసి సుందరంగా తీర్చిదిద్దడంపై సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, ఆహార పదార్థాల రుచి చూశారు. విద్యార్థుల విద్యాస్థాయిని డీవైఈఓతో పాటు ఎంఈఓలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ పరిశీలించారు. ఉపాధ్యాయులు వృత్తి పట్ల మరింత అంకితభావంతో పని చేయాలన్నారు. ఈ సందర్భంగా డీవైఈఓ నరసింహఫణి, ఎంఈఓలు రామలక్ష్మణమూర్తి, సూర్యనారాయణలను పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రగతి రామారెడ్డి, ఉప సర్పంచ్ పోతంశెట్టి సాయిరామ్మోహన్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు చింతా సుబ్బారెడ్డిలు దుశ్శాలువా, జ్ఞాపికతో సత్కరించారు.

బ్లడ్ బ్యాంక్ సేవలను వినియోగించుకోండి



బ్లడ్ బ్యాంకు వద్ద రక్తదానం చేసిన విద్యార్థులు, వైద్య బృందంతో మూర్తి తదితరులు

రామచంద్రపురం: స్థానిక ఏరియా హాస్పిటల్ వద్ద రక్తనిధి కేంద్రంలో రక్తదాన సేవా కార్యక్రమాన్ని ప్రారంభించామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని ఏరియా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు తొగరుమూర్తి తెలిపారు. ఈ రక్తనిధి కేంద్రంలో బ్లడ్ డోనర్స్‌కు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భిణులకు, ప్రమాద బాధితులకు, ఆపరేషన్ అవసరమైన వారికి రక్తం కావాలంటే కాకినాడ రాజమండ్రి బ్లడ్ బ్యాంకులకు వెళ్లి చాలా ఇబ్బందులు పడేవారని, ఇప్పుడు ఏరియా హాస్పిటల్ వద్ద జాయిన్ అయిన పేషెంట్లకు ఉచితంగా పరీక్షలు నిర్వహించి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సేవే లక్ష్యంగా పనిచేస్తూ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసిన బీసీ సంక్షేమ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణకు కృతజ్ఞతలు తెలియజేశారు. యువతీ యువకులు సామాజిక దృక్పథంతో రక్తదానం చేయడానికి ముందుకు రావాలని మూర్తి పిలుపునిచ్చారు. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎప్పుడు రక్తం కొరత వచ్చినా తమ విద్యార్థినీ విద్యార్థులు అందుబాటులో ఉంటారని హామీ ఇచ్చిన మోడరన్ కళాశాల వ్యవస్థాపకుడు డాక్టర్ లయన్ జీవీ రావు, కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ డైరెక్టర్ పవన్, ప్రిన్సిపాల్ వెంకట్‌లకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు మూర్తి తెలిపారు. కిట్స్ ఇంజినీరింగ్ కాలేజీ, మోడరన్ కళాశాల విద్యార్థులు, మరికొందరు మానవతావాదులు రక్తదానం చేశారన్నారు.

గ్రామాల్లో 'జగనన్న ఆరోగ్య సురక్ష'



వెదురుమూడిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఏర్పాట్లు చేస్తున్న సచివాలయ సిబ్బంది

కపిలేశ్వరపురం: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా బుధవారం ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు చేశారు. గ్రామాల్లో క్లస్టర్ వారీగా సచివాలయ సిబ్బంది బాధ్యతలు స్వీకరించి వైద్య శిబిరాల నిర్వహణపై ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు అవగాహన కరపత్రాలను పంచుతున్నారు. వైద్య ఆరోగ్య కార్యకర్తలు బీపీ, షుగర్ తదితర ఏడు రకాల పరీక్షలు చేయగా వాటి వివరాలను నిర్దేశించిన యాప్‌లో నమోదు చేశారు. అంగర-2 సచివాలయ పరిధిలో 1,606 నివాసాలకు 1,307 ఇళ్లకు వెళ్లి పరీక్షలు పూర్తి చేశారు. కపిలేశ్వరపురంలో 2,711కు 2,194, కోరుమిల్లిలో 2,062కు 1,592, పడమర ఖండ్రికలో 1,227కు 459, తాతపూడిలో 779కు 602, అద్దంకివారిలంకలో 836కు 624, కేదారిలంకలో 1,298కు 739, టేకిలో 2,158కు 1,569 ఇళ్లకు వెళ్లి ఆరోగ్య వివరాలను నమోదు చేశారు. అక్టోబర్ 3 నుంచి ప్రారంభమయ్యే వైద్య శిబిరాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

లక్ష్యసాధనకు ముందుకు సాగాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఏఎస్సై రసీదా

రామచంద్రపురం: చిన్నతనం నుంచి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కాకినాడ దిశ మహిళా పోలీస్ ఏఎస్సై మహ్మద్ రసీదా అన్నారు. బుధవారం స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు ప్రభుత్వ జాతీయ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ వి.సోమశేఖరరావు అధ్యక్షతన బాలికలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్ఐ రసీదా, హెడ్ కానిస్టేబుల్ కె.లలిత, సచివాలయ మహిళా పోలీసు కిరణ్‌జ్యోతి మాట్లాడుతూ ఆడపిల్లలు విద్యకు ప్రాధాన్యమిచ్చి భవిష్యత్తులో ఉన్నత స్థానాలను సాధించాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే అనర్థాలను వివరించారు. దిశ యాప్‌తో ప్రయోజనాలను తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు లావణ్య, సునీత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

సొసైటీలతో రైతులకు మెరుగైన సేవలు



వెలగతోడు సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ కోటేశ్వరరావు

మండపేట: రైతులకు మెరుగైన సేవలు అందించడం ద్వారా సొసైటీని అభివృద్ధి పథంలో నడిపిస్తామని వెలగతోడు సొసైటీ చైర్మన్ ముక్కపాటి కోటేశ్వరరావు అన్నారు. వెలగతోడు సొసైటీ ఆవరణలో బుధవారం సొసైటీ మహాజన సభ చైర్మన్ కోటేశ్వరరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సహకారంతో సొసైటీ ఆర్థిక పరిపుష్టికి కృషి చేస్తున్నామన్నారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను సొసైటీ రూ.16 లక్షల ఆదాయం రాగా బైలా నంబర్ 35 ప్రకారం రైతులకు పంపిణీ చేశామన్నారు. గత నెలాఖరు నాటికి 654 మంది రైతులకు రూ. ఏడు కోట్ల వరకూ రుణసాయం అందించామన్నారు. పర్సన్లు పిల్లి చినఅప్పారావు, చిటికెన వీర్రాజు, సీఈఓ చుంద్రు పాపారావు, రైతులు పుట్టా వెంట్రారావు, తుమ్మా వీరబాబు వంక కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

కాజులూరు: వ్యవసాయ రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ గుత్తుల బుల్లిరాజు అన్నారు. మండలంలోని పలు ఆర్‌బీకేల్లో ఎలుకల నివారణ మందు పంపిణీ చేశారు. గొల్లపాలెంలో వీఏఏ వనుం రమ్య ఆధ్వర్యంలో జరిగిన సభలో బుల్లిరాజు మాట్లాడారు.

పర్యాటక రంగంతో దేశ ప్రగతి

రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టూరిజం స్వామినాయుడు



మాట్లాడుతున్న రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టూరిజం స్వామినాయుడు

రామచంద్రపురం రూరల్: పర్యాటక రంగం ద్వారా దేశం ప్రగతి పథంలో పయనిస్తుందని రీజినల్ జాయింట్ డైరెక్టర్ ఆఫ్ టూరిజం వి.స్వామినాయుడు అన్నారు. బుధవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. దేశంలోని వివిధ ప్రాంతాలను సందర్శించడం ద్వారా ఆయా చోట్ల సంస్కృతీ సంప్రదాయాలను తెలుసుకోవడం, జాతీయ సమైక్యత, భిన్నత్వంలో ఏకత్వం వంటి భావనలు పెరుగుతాయన్నారు. ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు మాట్లాడుతూ ప్రాచీన చరిత్ర కలిగిన ద్రాక్షారామ భీమేశ్వరాలయంలోని చారిత్రాత్మక సంపదను పరిరక్షించుకోవాలన్నారు. అనంతరం ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్ విద్యార్థినీ, విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. గ్రామ సర్పంచ్ కొత్తపల్లి అరుణ, హెచ్‌ఎం గుణ్ణం రాజేశ్వరి, జిల్లా టూరిజం అధికారి పి.వెంకటాచలం, డివిజనల్ మేనేజర్ సీహెచ్ పవన్ కుమార్, టూరిజం రిసోర్స్ పర్సన్లు పి.మెహర్ సుజాత, అరవ విస్సు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వినాయకా... సెలవిక

- ఘనంగా గణపతి విగ్రహాల నిమజ్జనోత్సవం
- ప్రతి గ్రామంలో ఉత్సవ సందడి



మండపేటలో గణపతి విగ్రహాన్ని నిమజ్జనానికి తరలిస్తున్న కమిటీ సభ్యులు

మండపేట: జైగణేశ.. శ్రీగణేశా అంటూ ఆ స్వామి వారిని భక్తులు మనసారా కొలిచారు.. గణపతి నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని ఆయా ఉత్సవ మండపాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాల నిమజ్జనోత్సవాలు కోలాహలంగా జరిగాయి. మండపేటలోని గొల్లలగుంట, రాజారత్నరోడ్డు, సత్యశ్రీ రోడ్డు తదితర ప్రాంతాల్లో నెలకొల్పిన వినాయక విగ్రహాలను ఆయా ఉత్సవ కమిటీలు ప్రత్యేకంగా అలంకరించిన వాహనాల్లో ఊరేగించి పెద్దకాలువ, పేకేటి పాకలు కాలువల్లో నిమజ్జనం చేశారు. మండలంలోని ద్వారపూడి, కేశవరం, ఏడిద, ఇప్పనపాడు తదితర గ్రామాల్లో గణనాథులను ఊరేగించి వీడ్కోలు పలికారు.

కె.గంగవరం: కె.గంగవరం మండలం, రామచంద్రపురం రూరల్ మండలాల్లో కొలువైన గణేశ విగ్రహాలను కోటిపల్లి గౌతమీ గోదావరిలో నిమజ్జనం చేశారు. ఈ ఊరేగింపులతో కోటిపల్లి– కె.గంగవరం రహదారి జనసంద్రంగా మారింది. ఎస్సై జి.నరేష్ ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఈ ఒక్కరోజే కోటిపల్లిలో సుమారు 200 వినాయక విగ్రహాలను గౌతమి గోదావరిలో నిమజ్జనం చేశారు. అనంతరం భక్తులు పుణ్యస్నానాలు ఆచరించడానికి ఫెర్రీ వద్ద పుష్కర ఘాట్లలో ఏర్పాట్లు చేశారు. కె.గంగవరం ఎస్సై జానీ బాషా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించారు.

రాయవరం: మండలంలో తొమ్మిది రోజుల పాటు పూజలందుకున్న గణనాథులు బుధవారం గంగమ్మ ఒడికి చేరారు. విఘ్నేశ్వరుడికి భక్తిశ్రద్ధలతో పూజలు చేసిన భక్తులు ఘనంగా వీడ్కోలు పలికారు.

కపిలేశ్వరపురం: కపిలేశ్వరపురం, తాతపూడి, కేదారిలంక, అద్దంకివారిలంక తదితర గ్రామాల్లోని మండపాల్లో వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని తహసీల్దార్ కొమరం సూర్యారావు, అంగర ఎస్సై జి.చంటి పర్యవేక్షించారు. అంగర, పడమర ఖండ్రిక, నేలటూరు తదితర గ్రామాల నుంచి విగ్రహాలను తీసుకువచ్చి గోదావరిలో నిమజ్జనం చేశారు. అంగరలోని ఆర్యవైశ్య శ్రీకన్యకా పరమేశ్వరి సత్రంలో వినాయక నవరాత్ర శిబిరంలో స్వామికి భక్తులు సమర్పించిన పలు లడ్డూలకు వేలం నిర్వహించారు. గ్రంధి రామకృష్ణ కుటుంబ సభ్యులు వాటిని రూ.16,101కి పాడుకున్నారు.

వినాయక లడ్డూకు రూ.50 వేలు

రామచంద్రపురం: స్థానిక డఫేదార్ సెంటర్‌లో బాలభక్త సమాజం ఆధ్వర్యంలో గణపతి నవరాత్ర మహోత్సవాలు జరుగుతున్నాయి. ఇక్కడ 64 కిలోల లడ్డూను వేలంలో శ్రీవీరభద్ర ట్రావెల్స్ అధినేత పనస దుర్గారావు, కొప్పిశెట్టి శ్రీనివాస్‌లు రూ. 50 వేలకు దక్కించుకున్నారు. ఈ లడ్డూలను తాపేశ్వరం సురుచిఫుడ్స్ అధినేత పోలిశెట్టి మల్లిబాబు కమిటీకి అందజేశారని సభ్యులు తెలిపారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నెలకొల్పిన గణనాథుని విగ్రహాలను భక్తిశ్రద్ధలతో నిమజ్జనం చేశారు. వెలంపాలెం, కంబాల చెరువు, ద్రాక్షారామ ఆటోస్టాండ్, జగన్నాయకుల పాలెం తదితర గ్రామాల్లో విగ్రహాలను ఊరేగింపుగా కోటిపల్లికి తరలించి గోదావరిలో నిమజ్జనం చేశారు. ద్రాక్షారామ ఎస్సై బి.వినోద్ నేతృత్వంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద గణపతి లడ్డూలను వేగాయమ్మపేటకు చెందిన శ్రీధనలక్ష్మి ఫెర్టిలైజర్స్ అధినేతలు గెద్దాడ సుబ్రహ్మణ్యం, గెద్దాడ సురేష్‌లు రూ.13 వేలకు, దునే రాంబాబు రూ.6 వేలకు దక్కించుకున్నారు.

కాజులూరు: మండలంలోని గొల్లపాలెం, మొగలిపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరి, కోలంక తదితర గ్రామాల్లో నిర్వాహక కమిటీల ఆధ్వర్యంలో వినాయక విగ్రహ నిమజ్జనాలు జరిగాయి. మొగలిపాలెం తదితర గ్రామాల్లో అన్నసమారాధనలు నిర్వహించారు.



కోటిపల్లి గౌతమీ గోదావరిలో వినాయక విగ్రహాన్ని నిమజ్జనం చేసేందుకు పడవపై తీసుకువెళ్తున్న భక్తులు



అంగర ఆర్యవైశ్య సత్రంలో పాడుకున్న లడ్డూలతో పాటదారులు



రామచంద్రపురంలో వేలంలో దక్కించుకున్న లడ్డూను అందిస్తున్న కమిటీ సభ్యులు



కంబాల చెరువులో వినాయకుని విగ్రహ ఊరేగింపులో యువకులు



మొగలిపాలెంలో ఊరేగింపుగా వెళ్తున్న గణనాథులు

రైతు సేవలో మాచర పీఏసీఎస్



మాచర పీఏసీఎస్‌లో మాట్లాడుతున్న రైతులు

కపిలేశ్వరపురం: మాచర పీఏసీఎస్ సేవల్లో ముందంజలో ఉందని రైతులు అన్నారు. బుధవారం ఆ పీఏసీఎస్ కార్యాలయంలో చైర్మన్ కరెడ్ల చంటిబాబు అధ్యక్షతన మహాజన సభ జరిగింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆడిట్ నివేదికను సీఈఓ తోటకూర సురేష్ ప్రవేశపెట్టగా పాలకవర్గ సభ్యులు ఆమోదించారు. 2023 ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకూ ఉన్న జమా ఖర్చులను తీర్మానించారు. చైర్మన్ చంటిబాబు మాట్లాడుతూ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.8.36 లక్షల లాభాలను ఆర్జించినట్టు తెలిపారు. రైతునేస్తం పథకం పేరుతో పదేళ్ల పాటు వాయిదాల రూపంలో చెల్లించే పద్ధతిలో ఎకరాకు రూ.8 లక్షల చొప్పున రుణ సదుపాయం కల్పిస్తున్నామన్నారు. డైరెక్టర్లు, రైతులు కరెడ్ల వెంకట గుణేశ్వరరావు, గోసంగి పట్టాభిరామయ్య, బడుగు నల్లబాబు, కోన భగవాన్, అడపా అన్నవరం, యర్రంశెట్టి సూర్యనారాయణ, పడాల రామ్మోహనరావు పాల్గొన్నారు.

వైభవంగా గణపతి హోమం



ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో గణపతి హోమం చేస్తున్న పండితులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దుండి గణపతి వద్ద బుధవారం దేవస్థానం ఆధ్వర్యంలో గణపతి హోమం నిర్వహించారు. సమాజ శ్రేయస్సు కోసం ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు, వరలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ఆలయ అర్చకులు, వేద పండితులు, అభిషేక పురోహితులు, చండీ హోమందారులు శాస్త్రోక్తంగా హోమం జరిపించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

నిరంతర విద్యుత్తు సరఫరా లక్ష్యం



విద్యుత్తు వాడకంలో జాగ్రత్తలను వివరిస్తున్న ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈ విష్ణుమూర్తి

కాజులూరు: అంతరాయం లేకుండా ప్రజలకు నిరంతరం నాణ్యతతో కూడిన విద్యుత్తును సరఫరా చెయ్యాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఏపీ ట్రాన్స్‌కో ఏడీఈ విష్ణుమూర్తి అన్నారు. గొల్లపాలెం విద్యుత్ స్టేషన్ ఆవరణలో బుధవారం ఏఈ సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన సభలో ఏడీఈ మాట్లాడారు. నాణ్యమైన విద్యుత్తు సరఫరాకు ఏపీ ట్రాన్స్‌కో నిరంతరం కృషి చేస్తుందన్నారు. విద్యుత్తు వినియోగంపై గృహ వినియోగదారులు, ఆక్వా రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సభలో సబ్ ఇంజినీర్ రామకృష్ణ, సబ్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏఎంసీ తొలి సమావేశం

ఆలమూరు: స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో తొలి సమావేశం బుధవారం జరిగింది. చైర్మన్ యనమదల నాగేశ్వరరావు అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలో కార్యవర్గ సభ్యులు పాల్గొని వ్యవసాయ మార్కెట్ కమిటీ ద్వారా చేపట్టవలసిన అభివృద్ధి కార్యక్రమాలపై చర్చించారు. మెజారిటీ సభ్యులు మండలంలోని వివిధ గ్రామాల్లోని పుంత రోడ్లు అభివృద్ధి చేయాలని తీర్మానించారు. రాష్ట్ర పార్టీ సేవాదళ్ సంయుక్త కార్యదర్శి చల్లా ప్రభాకరరావు, మండల బూత్ కమిటీ మేనేజర్ నామాల శ్రీనివాసు, వైస్ చైర్మన్ వెత్సా సురేష్‌కుమార్, సర్పంచ్ నేలపూడి లావణ్య, ఏఎ ఎస్.లక్ష్మీ లావణ్య మార్కెటింగ్ డైరెక్టర్లు పాల్గొన్నారు.